సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



దురాశ బ్యాంకు ఖాతాకు..

జిల్లాలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి. విద్యావంతులే బలైపోతున్నారు.

- 8లో



పడవ బోల్తా పడి..

కొవ్వాడలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతిచెందాడు. వేకువజామున ప్రమాదం జరిగింది.

- 8లో



అరటి గెలల నీరాజనం

సారవకోట: తొగిరి అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అరటి గెలలను కట్టారు. మొత్తం 108 అరటి గెలలు వేలాడదీశారు.

న్యూస్‌రీల్

'పీవీకి భారతరత్న సముచిత నిర్ణయం'

నరసన్నపేట: భారత దేశాన్ని ఆర్థిక, బలమైన దేశంగా తీర్చిదిద్దడంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఎంతో కృషి చేశారని, అలాంటి వ్యక్తికి భారత అత్యున్నత పురస్కారం లభించడం ఆనందదాయకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, బహుభాషా కోవిదుడికి భారత రత్న ఇవ్వడం ఎంతైనా సముచితమని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కంప్లైంట్ మానిటరింగ్ సెల్ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధులపై దృష్టి సారించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ఎన్నికలకు సంబంధించి కంప్లైంట్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఫిర్యాదులు స్వీకరిస్తారు. పత్రికల్లో వచ్చిన కథనాలు, ఆన్‌లైన్ ఫిర్యాదులు, నేరుగా వచ్చిన ఫిర్యాదులు, 1950 ద్వారా వచ్చిన ఫోన్ ఫిర్యాదులను వీరి పర్యవేక్షిస్తారు. వీటిపై నివేదికలు సిద్ధం చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తారు. ఈ సెల్ కలెక్టరేట్‌లోని ఈడీఎం విభాగం నుంచి నిర్వహిస్తారు.

మానవ అక్రమ రవాణా నేరం



పుస్తకావిష్కరణ చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మానవ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలకు చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ,డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ ఎండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కేవీ రమణ తదితరులు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో పదోన్నతులు, బదిలీలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సుదీర్ఘకాలం తర్వాత దేవదాయ శాఖలో ఈఓలకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరంలోని రామతీర్థాలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ) బి.హెచ్.ఎస్.ఎన్.కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్(డీసీ)గా పదోన్నతి కల్పిస్తూ తూర్పు గోదావరి జిల్లా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న డి.వి.ఎల్.రమేష్ బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. కోనసీమ జిల్లాలో ఏసీగా పనిచేస్తున్న కె.ఎస్.డి.వి.ప్రసాద్‌కు డీసీగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా నియమించారు. ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న డీవీవీ ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సింహాచలం దేవస్థానంలో గతంలో ఏఈఓగా పనిచేసి ప్రస్తుతం అన్నవరంలో ఏఈఓగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు దేవస్థానం ఈఓగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో ఏసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అదే జిల్లా ఏసీగా నియమించారు. అక్కడ ఏసీగా పనిచేస్తున్న హరి సూర్య ప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది.

చిన్న బాబు.. పెద్ద డాబు





'నాయనా లోకేష్.. చాలారోజులకు శ్రీకాకుళం జిల్లాకు.. అందులోనూ పలాస ప్రాంతానికి వస్తున్నావు. వచ్చే దారిలో రేగులపాడు వద్ద రూ.852.45కోట్లతో ఆఫ్‌షోర్ పనులు జరుగుతున్నాయి చూడు. టెక్కలి మీద నుంచి వస్తూ అటుగా తీరంలో రూ.3వేల కోట్లతో మూలపేట పోర్టు కడుతున్నారు గమనించు. పలాసకే వస్తున్నావు కదా.. అక్కడే రూ.85 కోట్లు పెట్టి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కట్టారు. ఓ సారి పరిశీలించు. ఇచ్ఛాపురం వైపు వెళ్లే దారిలో మకరాంపురంలో వైఎస్సార్‌సుజల ధార అని హిరమండలం నుంచి వస్తున్న వంశధారను పరిశీలించు.. ఇక్కడ దశాబ్దాల పాటు తిష్ట వేసుకుని పాలించిన నాయకులకు చేతకాని ఈ పనులు ఐదేళ్లలోనే జరిగాయి.. తప్పకుండా మీరు చూడాలి' టీడీపీ చినబాబు లోకేష్‌కు సగటు సిక్కోలు వాసి సూచన ఇది. ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ చేసిన మోసాలు, తప్పిన మాటలు అన్నీ మర్చిపోయి ఓట్లు అడిగేందుకు ఆయన సిద్ధమైపోయారు.

- అధికారంలో ఉన్నప్పుడు కళ్లకు గంతలు కట్టుకున్న టీడీపీ
- జిల్లాలో ఒక్క శాశ్వత ప్రాజెక్టునూ నిర్మించని వైనం
- ఎన్నికలు సమీపిస్తుండడంతో మొసలి కన్నీరు కార్చేందుకు సిద్ధం
- జిల్లాలో నేడు లోకేష్ పర్యటన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

చంద్రబాబు కుమారుడు లోకేష్ జిల్లా పర్యటనకు సిద్ధమైపోయారు. పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఆయన ఆదివారం పర్యటించనున్నారు. ఇటీవలే పాదయాత్ర ముగించిన ఆయన కనీసం జిల్లాలో అడుగు కూడా పెట్టలేదు. అప్పట్లో చంద్రబాబు కూడా జిల్లాను ఇలాగే నిర్లక్ష్యం చేశారు. కనీసం ఇక్కడి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం కూడా ఏనాడూ చేయలేదు. ఈ ఐదేళ్లలో జిల్లాలో ప్రగతి పనులు జోరుగా జరిగాయి. ఇన్నేళ్లు జిల్లాను మర్చిపోయి ఎన్నికలు వస్తున్నాయనగా పర్యటనకు సిద్ధమైన లోకేష్ వైఖరిపై జిల్లా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మొదటి నుంచి టీడీపీ జిల్లాకు అన్యాయం చేస్తూనే ఉంది. అధికారంలో ఉండగా కళ్లకు పచ్చ గంతలు కట్టుకున్న నాయకులు జిల్లాలో ఒక్కటంటే ఒక్కటి కూడా శాశ్వత ప్రాజెక్టును కట్టే ప్రయత్నం ఏనాడూ చేయలేదు. శ్రీకాకుళం అంతా వెతికినా చంద్రబాబు అండ్ కో చేసిన మంచి పని ఒక్కటీ కనిపించదు. రిమ్స్ నుంచి వంశధార ప్రాజెక్టు వరకు, బీఆర్ఏయూ నుంచి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వరకు, ఆఫ్‌షోర్ నుంచి మూలపేట పోర్టు వరకు అన్నీ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆ తర్వాత వైఎస్ జగన్ హయాంలో మాత్రమే జరిగాయి. అభివృద్ధితో పాటు సంక్షేమం కొనసాగుతోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన పనులు



పలాసలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్


- ఉద్దానం కిడ్నీ వ్యాధి నియంత్రణ కోసం రూ. 700కోట్లకు పైగా వ్యయంతో వైఎస్సార్ సుజలధార ఏర్పాటు చేశారు.
- పలాసలో రూ.85కోట్లకు పైగా వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మించింది.
- 26వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు మహేంద్ర తనయ వద్ద రూ. 852.45కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను ప్రభుత్వ చేపడుతోంది.
- జిల్లాకే తలమానికంగా నిలిచే మూలపేట పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 2,949.70కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది.
- మంచినీళ్లపేటలో రూ. 11.95కోట్లతో జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- 42 గ్రామాల రహదారి సమస్యను తీర్చేలా రూ. 1.58కోట్లతో నరేంద్రపురం కణితూరు మధ్య వంతెన నిర్మించింది.
- ఇచ్ఛాపురం నుంచి కొళిగాం వరకు 10 కిలో మీటర్లు రూ.10 కోట్ల నిధులతో నిర్మించారు.
- టెక్కలిలో 200 పడకల ఆస్పత్రి పనులు, లింగాలవలసలో పీహెచ్‌సీ పనులు పూర్తి చేశారు.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ. 100.09 కోట్లతో అర్బన్ వాటర్ స్కీమ్ నిర్మించింది.
- రూ. 21కోట్లపైగా వ్యయంతో అతి ముఖ్యమైన కాశీబుగ్గ-వజ్రపుకొత్తూరు రోడ్డు, రూ.19కోట్లతో టెక్కలిపట్నం-నువ్వుల రేవు రోడ్డు నిర్మించింది.
- ఏఎంసీ నిధుల నుంచి రూ. 9కోట్లతో వంతెనలు నిర్మించింది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ పునర్నిర్మాణం పనులను రూ. 18కోట్లతో చేపడుతోంది.
- జంట పట్టణాల్లో 2555 ఇళ్లతో అతి పెద్ద జగనన్న కాలనీని రామకృష్ణాపురంలో నిర్మించింది.
- పలాసను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది. హరిపురంలో కొత్త డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసింది.
- టెక్కలి నియోజకవర్గంలో రూ.60 కోట్లతో రోడ్లు , నందిగాంలో విత్తనోత్పత్తి కేంద్రం నిర్మించారు.
- పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హరిపురం, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణ తర్లాకు మహిళా జూనియర్ కళాశాలలు మంజూరు చేసింది.
- జీడి పరిశ్రమలకు రూ. 2014 నుంచి రావాల్సిన ప్రోత్సాహకాల కింద రూ. 120కోట్లు విడుదల చేసింది.
- తిత్లీ తుఫాన్ బాధిత రైతులకు కొబ్బరి చెట్టుకు రూ. 3వేలు, జీడి రైతులకు హెక్టార్‌కు రూ.50వేలు అందజేశారు. రూ. 500కోట్లు వరకు అదనంగా వెచ్చించారు.



మూలపేట పోర్టులో జోరుగా నిర్మాణాలు

టీడీపీ హయాం అంతా అవినీతే..

- జిల్లాలో ఐదేళ్ల టీడీపీ పాలన అవినీతిమయంగా సాగింది. రూ. వేల కోట్ల ఇసుకను దోచేశారు. అక్రమ తవ్వకాల కారణంగా నదుల్లో ఏర్పడిన గోతుల్లో పడి పదుల సంఖ్యలో జనం చనిపోయారు. వందలాది మంది గాయపడ్డారు.
- 2014మే 14వ తేదీన టీడీపీ ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఇసుక దందా నియంత్రణకై నియమించిన వీఆర్‌ఓలపై దాడి చేసింది. నైరాలో జరిగిన ఈ ఘటనలో చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, చంద్రభూషణ్‌కు తీవ్రగాయాలయ్యాయి.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న బాహుదా, మహేంద్రతనయ నదుల్లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపారు. బాహుదా నదిలో నిషేధిత ప్రాంతాలన్నింటిలోనూ ఇసుకను ట్రాక్టర్లతో తరలించారు. ఇచ్ఛాపురం పట్టణ సరిహద్దులో బ్రిడ్జితో పాటు ఇటు ఈదుపురం నుంచి అటు బొడ్డపడ వరకు నదీ తర గ్రామాలన్నింటిలోనూ తవ్వకాలు చేపట్టారు. ఇక్కడి వారు చాలదన్నట్టు గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ మంత్రి అనుచరులు కూడా ఇక్కడికొచ్చి ఇసుక దందా చేశారు.
- కేవలం దోచుకోవడానికి చంద్రన్న బాట రోడ్లు, రైతు రథం పేరుతో ట్రాక్టర్ల పథకం పెట్టారు. వాటి ముసుగులో వందల కోట్లు కొట్టేశారు.
- తిత్లీ పరిహారాన్ని దోచేశారు. పెంచుతామన్న పరిహారం ఇవ్వలేదు.
- టీడీపీ అధికారంలో ఉండగా రూ. 300కోట్ల మేర గనులు దోపిడీ చేశారు.
- నీరు-చెట్టు కింద చేపట్టిన పనుల్లో వందల కోట్లు మింగేశారు.



టీడీపీ ఇచ్చి మర్చిపోయిన హామీలు

- ఉద్దానంలో కోకోనట్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇలా మాటిచ్చి అలా మర్చిపోయారు.
- సోంపేట, తీర ప్రాంతాల్లో మత్స్యకార పరిశ్రమలు పెడతామని చెప్పారు. ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేకపోయారు.
- భావనపాడు రేవులో ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కానీ చేతులెత్తేశారు.
- వంశధార, నాగావళి, బాహుదా నదుల అనుసంధానమన్నారు. చేసిందేమీ లేదు గానీ డీపీఆర్ పేరుతో కోట్లు నొక్కేశారు.
- ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని చేయలేదు.
- రైతులకు రుణమాఫీ చేయకుండా నిండా ముంచేశారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వకుండా వంచనకు గురి చేశారు.
- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 2018 జనవరి 27వ తేదీన రూ.2కోట్లతో క్రీడా వికాస కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదు.
- సోంపేట మండలంలో జాతీయ రహదారి నుంచి లక్కవరం గ్రామానికి తారు రోడ్డు వేస్తామని శంకుస్థాపన చేశారు. పనులు మర్చిపోయారు.
- 2015,16,17,18 సంవత్సరాలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు అందజేశారు.
- 2018 నవంబర్ 28న అరకబద్ర బాహుదాన దిపై వంతెన నిర్మించేందుకు స్థానిక ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో పాటు ఎమ్మెల్యే బెందాళం అశోక్ శంకుస్థాపన చేయడంతో పాటు పీఎస్‌ఆర్ కంపెనీ పనులు కోసం హడావిడి చేసి చేతులెత్తేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 90 శాతం పనులు పూర్తి చేసింది.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- నాన్ జంబ్లింగ్ విధానంలో మొదటి స్పెల్‌లో 94 కేంద్రాల్లో పరీక్షలు
- జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా డీవీఈఓ కోట ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా నియామకమైన డీవీఈఓ కోట ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు నేతృత్వంలోని డీఈసీ కమిటీ పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఏడాది నామినల్ రోల్స్, బ్యాచ్‌ల ఏర్పాటు, ఎగ్జామినర్ల నియామకాలు, నియామక ఉత్తర్వులు, హాల్‌టిక్కెట్లు ఇలా అన్నీ జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్ ఆన్‌లైన్‌లో ఇంటర్ బోర్డు పొందుపరిచింది. ఇప్పటికే విద్యార్థుల హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసి అందజేసేలా ప్రిన్సిపాళ్లకు అధికారులు పక్కాగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే మొదటిసారి ఇంటర్మీడియెట్ బోర్డు సాంకేతికతను వినియోగించుకుంటోంది. సబ్జెక్టులవారీగా కేటాయించిన మార్కులను జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో సీసీ కెమెరాల స్ట్రీమింగ్‌లో నమోదు చేయనున్నారు.



సిద్ధంగా పరికరాలు

131 కేంద్రాలు.. 14,783 మంది విద్యార్థులు

నాన్ జబ్లింగ్ విధానంలో జరిగే ఈ ప్రాక్టికల్ పరీక్షలకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 131 కేంద్రాలను కేటాయించారు. ఈ పరీక్షలకు జిల్లా మొత్తం 14,783 మంది సైన్స్ విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ఎంపీసీ నుంచి 10074 మంది, బైపీసీ నుంచి 4709 మంది ఉన్నారు. నేటి నుంచి మొదటి స్పెల్‌లో 94 కేంద్రాలలో పరీక్షలు మొదలవుతాయి. ఆర్ఐఓ నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్-జీజేసీ ఆమదాలవలస), గూణ సింహాచలం (ప్రిన్సిపాల్-జీజేసీ రణస్థలం), కీర్తి తవిటినాయుడు (ప్రిన్సిపాల్- జీజేసీ కొయ్యాం), ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టనున్నారు.

● అభిమాన నేతకు క్షీరాభిషేకం

ఎల్ఎన్ పేట మండలంలోని కోవిలాం కాలనీ వద్ద శనివారం ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మహిళా సంఘాల సభ్యులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

- ఎల్ఎన్ పేట



అభివృద్ధిపై చర్చకు రా..

- నారా లోకేష్‌కు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సవాల్

వజ్రపుకొత్తూరు: పలాసతో పాటు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై దమ్ముంటే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చర్చకు రావాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. ఆయన శనివారం వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరులో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవ సభలో మాట్లాడారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు జిల్లాకు చేసిన మేలేమిటో చెప్పాలన్నారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధిని తాము చూపిస్తామని అన్నారు. 'నీకు దమ్ముంటే పలాసలో బహిరంగ చర్చకు నేను సిద్ధం. ఎక్కడికి రమ్మంటావో చెప్పు.. లేకుంటే నీ శంఖారావం సభలోకే రమ్మంటావా..' అంటూ విరుచుకుపడ్డారు. తిత్లీ తుపాను సమయంలో మూడు వారాల పాటు పలాసలో మకాం వేసి నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానన్న మాట ఏమైందన్నారు. శంఖారావానికి వచ్చినప్పుడు కిడ్నీ ఆస్పత్రి, శుద్ధజల పథకం చూడాలని సూచించారు. మూలపేటలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టు చూడాలన్నారు. తనను పశువుల మంత్రి అని మాట్లాడుతున్న గౌతు శిరీష తన తాత, తండ్రి పాలనలో ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలన్నారు. జన్మభూమి కమిటీలతో దోచుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. స్థానిక సర్పంచ్ మామిడి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఉప్పాడ ఉపేంద్ర, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దున్న వీరస్వామి, కొర్రాయి గోపి, ఐ.హేమంత్‌రాజు, దున్న బాలరాజు, నర్తు లక్ష్మీనారాయణ, పోలీస్ హసింగ్ బోర్డు డైరెక్టర్ సూరాడ రాజేశ్వరి, గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పల్లివూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

క్లుప్తంగా

స్పందించిన దాతలు

పొందూరు: 'సాక్షి'లో ఈ నెల 5న ప్రచురించిన 'తల్లిదండ్రులు దూరం భవిత భారం' కథనానికి దాతలు స్పందిస్తున్నారు. గత నెల 17న విశాఖ జిల్లా ఆనందపరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు బాసటగా నిలుస్తున్నారు. తమకు తోచిన ఆర్థిక సాయాన్ని ఫోన్‌పే ద్వారా అందజేస్తున్నారు. బస్వా అనంతరావు రూ. 10 వేలు, ఎం.జగదీశ్వరరావు రూ. 5 వేలు, పలువురు వ్యక్తులు కలసి రూ. 23 వేలు, చదువుల సుబ్రహ్మణ్యం రూ. 5 వేలు అందించారు. సాయం చేయాలనుకునే వారు 9912474529 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

పరిశోధనలతో మెరుగైన విద్య



పుస్తక ఆవిష్కరణ చేస్తున్న వైస్‌చాన్స్‌లర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: బోధన సిబ్బంది పరిశోధనలతో మెరుగైన విద్య సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీలో ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు రాసిన ఎంబెడెడ్ సిస్టం విత్ మైక్రో కంట్రోలర్స్ పుస్తకాన్ని వీసీ శనివారం ఆవిష్కరించారు. బోధనలో అనుభవం ఉన్న అధ్యాపకుల పరిశోధన గ్రంథాలు విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య పాల్గొన్నారు.

'ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి'



మాట్లాడుతున్న జేడీఎం సనపల వెంకటరావు

ఎచ్చెర్ల: మండలంలోని టీటీడీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాబ్స్ మేనేజర్ సనపల వెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక సాంకేతిక అభివృద్ధి కేంద్రంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేషన్స్, స్పెషల్ సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న వారితో ఆయన మాట్లాడారు. డీఆర్‌డీఏ ద్వారా అందిస్తున్న శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న సర్పంచ్ జీవీఆర్, ఐటీబీపీ స్నేహితులు

గార: శిమ్మపేట గ్రామానికి చెందిన పారా మిలటరీ హెచ్‌సీ దుంగ రాంబాబు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు తోటి ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ స్నేహితులు శనివారం రూ. 2,10,674ల సాయం అందజేశారు. ఈ నగదును రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, గ్రామస్తులు చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఐటీబీపీ సిబ్బంది గొలివి శంకర్, పూడి జితేంద్ర, ముద్దపు నారాయణరావు, మురళీ, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్వేతగిరిపై ప్రతిష్ఠాపన మహోత్సవం

గార: శ్వేతగిరి (శాలిహుండం కొండ)పై సుమారు రూ. 2 కోట్లతో నూతనంగా నిర్మించిన వీరవసంతేశ్వర స్వామి దేవాలయాలు (వీరవసంతేశ్వర, అభయాంజనేయ, అయ్యప్ప సహిత నవగ్రహదేవాలయాలు) ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్ శర్మ తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు, 12వ తేదీ 9 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, 13వ తేదీ విశేష హవనాలు, సూర్యనమస్కారాలు, అయ్యప్ప, అభయాంజనేయ మంత్ర జపములు, సుందరకాండ పారాయణము, 14వ తేదీ బుధవారం 8 గంటల నుంచి యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కళావాహనం, 11 గంటల నుంచి ప్రతిష్ఠాంగ కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం హైదరాబాద్ వాస్తవ్యులు యోగేశ్వర శర్మతో మహాపడిపూజ, ప్రత్యేక భజనలు జరుగుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ద్విగళశతావధానం, మహాకవి సమ్మేళనం జరుగుతాయన్నారు.

దురాశ బ్యాంకు ఖాతాకు చేటు

- రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ మోసాలు
- ఉచ్చులో చిక్కుకుంటున్న విద్యావంతులు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి.. పని వేళల్లో చిన్న విరామం దొరికినా చాలు మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవాడు. మొదట్లో రూ. వేయి పెడితే రూ.1350.. రూ. 1800 పెడితే రూ. 2300 వచ్చాయి. అలా ఆడుతూ ఆడుతూ ఏకంగా రూ. 40 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. డబ్బంతా పోయాక మోసపోయానని గ్రహించాడు.

శ్రీకాకుళంలో ఓ ప్రముఖ వ్యాపారి మనవరాలు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఆమె కూడా ఇదే మాదిరే రూ. 22 లక్షలు మోసపోయింది. తండ్రి ఎందుకులే ఫిర్యాదు చేయడమని మిన్నకుండిపోయారు.

జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. చదువు లేని వారు, ఇంగ్లిష్‌లో ఫోన్ మెసేజీలు అర్థం కాని వారు మోసపోవడం వేరు. కానీ జిల్లాలో విద్యావంతులు, ఉద్యోగులు సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. రూ.లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నాక లబోదిబోమంటున్నారు. కొందరు ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు మిన్నకుండిపోతున్నారు. గడిచిన మూడేళ్లుగా 604 వైట్‌కాలర్ నేరాలు నమోదు కావడం విశేషం. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉన్న వారు, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారు ఆన్‌లైన్ మోసగాళ్ల ఉచ్చుకు చిక్కుకుంటున్నారు. మోసపోయామని తెలుసుకున్నాక కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక, ఆన్‌లైన్ ఫిర్యాదులు, సైబర్ సెల్ ఫిర్యాదుల వరకు వెళ్లినా.. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పరువుపోతుందేమోనని వెనకడుగు వేస్తున్నారు.

కొన్ని మోసాలు..

- గత జనవరి నెల బిట్‌కాయిన్స్ ట్రేడింగ్ టాస్కుల పేరిట ఆమదాలవలస మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ యువకుడి నుంచి రూ. 16.16 లక్షలు నెట్ బ్యాంకింగ్ ద్వారా సైబర్ కేటుగాళ్లు దోచుకున్నారు. అహ్మదాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉన్నా ఆమదాలవలసలో వర్క్‌ఫ్రం హోంగా ఉంటున్న ఆ ఉద్యోగిని టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన వీడియో క్లిప్పింగ్‌లకు రివ్యూ (లైక్) ఇస్తే అమౌంట్ వస్తుందని నమ్మించి ఇలా మోసం చేశారు.
- ఈ నెలలో జిల్లాకేంద్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇదే పంథాలో రూ. 17 లక్షల మోసానికి గురయ్యారు.
- గత ఏడాది డిసెంబరులో ఎస్బీఐ బ్యాంకు రివార్డ్ పాయింట్స్ పేరిట ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ. 50,999లు మోసానికి గురయ్యాడు. హెచ్‌టీటీపీఎస్://డీఎఎల్‌ఓపి.విఐఆర్‌సిఎల్.ఎపిపి/ లింక్ క్లిక్ చేయగానే రివార్డు పాయింట్స్ రూ. 9980లు రావడంతో ఆశపడిన ఆ ఉద్యోగి ఇలా బుక్ అయ్యాడు. డిసెంబరు 29న ఫిర్యాదు అందింది.
- టోల్‌ఫ్రీ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికి కంపెనీ ప్రతినిధి ఎవరన్నది తెలుసుకోకుండా మాట్లాడి.. వారు పంపిన మెసేజ్‌లు, బ్యాంకు అకౌంట్ డీటైల్స్ కంపెనీదా కాదా అని తెలుసుకోకపోవడం వల్ల నగరంలోని ఓ బిల్డర్ 13.10 లక్షలు మోసపోయాడు. అల్ట్రాటెక్ కంపెనీవి 3,300 బస్తాల సిమెంట్ కొనుగోలు కోసం టోల్‌ఫ్రీ నంబర్ సంప్రదించగా ఈ మోసం జరిగింది. ఘటన గత ఏడాది అక్టోబరులో జరిగింది.
- ఆమదాలవలస పట్టణంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ యువకుడు తన తండ్రి రిటైరవ్వగా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి దఫదఫాలుగా రూ. 8.87లక్షలు పంపి మోసపోయాడు.

పలు విధాలుగా వల

ఆన్‌లైన్‌లో చాలా విధాలుగా మోసం చేస్తున్నారు. ఫేక్‌ప్రొఫైల్స్‌తో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఎఫ్‌బీ, వాట్సాప్‌ల్లో దర్శనమిస్తారు. మనతో మాట్లాడాక బలహీనతలను గుర్తించి కావాల్సిన సమాచారం రాబడతాడు. డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు నంబర్లు, గడువు తేదీ, సీవీవీ కోడ్, ఓటీపీ వంటివి సేకరించి బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము కాజేస్తారు. మెయిల్, ఎస్ఎంఎస్ పంపించడం, లింక్‌లు పంపించడం, బ్యాంకు, కస్టమర్ కేర్ ప్రతినిధులమని ఫోన్ చేసి మోసం చేస్తుంటారు. డెబిట్, క్రెడిట్ కార్డు క్లోనింగ్ విధానంలో స్కిమ్మర్ అనే చిన్న ఎలక్ట్రానిక్ సాధనం ఉపయోగించి డెబిట్, క్రెడిట్ కార్డు వెనుక వైపు ఉన్న మాగ్నెటిక్ స్ట్రిప్‌లో ఉన్న కార్డు సమాచారాన్ని అక్రమంగా దొంగలిస్తారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

- బ్యాంకు, ఫైనాన్షియల్, కస్టమర్ కేర్ ప్రతినిధులమని ఎవరైనా ఫోన్ చేసినా మాట్లాడకూడదు. ఈ-మెయిల్, ఎస్ఎంఎస్‌లు పంపించినా వాటిని ఓపెన్ చేయకూడదు.
- ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, కార్డు నెంబర్లు, గడువు తేదీలు ఎవరైనా ఫోన్ చేసి అడిగితే చెప్పకూడదు.
- ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా అకౌంట్లను భద్రంగా ఉంచాలి.
- ఓపెన్, పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లకు ఎప్పుడూ కనెక్ట్ కావద్దు.
- ఇంటర్నెట్‌లో దొరికే సాఫ్ట్‌వేర్‌లను ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయకూడదు. లేటెస్టు యాంటీ వైరస్‌తో అప్‌డేట్ చేసి ఉంచుకోవాలి.
- అత్యాశ పడకపోతే మంచిది..

జాగ్రత్తగా ఉండాలి



ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త అవసరం. మెసేజ్‌లు, స్పామ్ కాల్స్, బ్లాక్ కాల్స్ రూపంలో ఫోన్‌లు వస్తుంటాయి. అవి లిఫ్ట్ చేసినా, మెసేజ్‌లపై క్లిక్ కొట్టినా మన ఖాతాలు ఖాళీ చేయడానికి సైబర్ చోరులు సిద్ధంగా ఉంటారు. ఇలాంటివాటిపై అప్రమత్తంగా ఉండి అత్యాశ పడకపోతే మంచిది. ఇప్పటికే ఇలాంటి సైబర్ నేరాలు చేస్తున్నవారి కొన్ని రాష్ట్రాలను గుర్తించి అక్కడికి మన పోలీసు బృందాలను పంపించి 41-ఏలు నమోదు చేశాం. అమౌంట్ రికవరీకి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్పీ రాధిక, శ్రీకాకుళం

యాత్ర-2 ను వీక్షించిన దాసన్న



యాత్ర-2 సినిమా చూస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక లక్ష్మీ థియేటర్‌లో శనివారం యాత్ర-2 సినిమాను ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ చూశారు. ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు వెళ్లారు. సినిమా చాలా బాగుందని ప్రతి సన్నివేశం భావోద్వేగానికి గురి చేసిందని ఎమ్మెల్యే అన్నారు.

పోలీసుల్లో నైపుణ్యాలు కీలకం: ఎస్పీ



గౌరవ వందన అందుకుంటున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసుల్లో నైపుణ్యాలు కీలకమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో 15 రోజుల పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు నిర్వహించిన మొబలైజేషన్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పోలీసులు నైపుణ్యాలు ప్రదర్శించారు. ముందుగా ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌ను ఎస్పీ వాహనంలో పరిశీలించారు. డ్రిల్ నిర్వహణను అభినందించారు. మొబలైజేషన్‌లో పోలీసులకు విశ్రాంతి, నూతన అంశాలు తెలుసుకునేందుకు మంచి అవకాశం లభించిందని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని, సమర్థంగా విధులు నిర్వహించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కేవీ నర్సింగరావు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో తుది వరకు ప్రయత్నించండి

- నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ కేవీ ఉజ్వల్
- ఏకం ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో సెమినార్



మాట్లాడుతున్న వెంకట్ ఉజ్వల్, పక్కనే ఏకం ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి సతీష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐఏఎస్‌కు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు ఒకసారి ఫెయిలైనంత మాత్రాన ఎలాంటి నిరుత్సాహం చెందకుండా.. పట్టుదలతో తుది వరకు ప్రయత్నించాలని నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం ఏకం ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో యూపీఎస్సీకి సన్నద్ధతపై ఉచిత అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉజ్వల్ మాట్లాడుతూ ఐఏఎస్‌కు ప్రిపేర్ అవుతున్న వారు ముందుగా ప్రిలిమ్స్‌పైనే దృష్టి సారిస్తారని, దీంతో మెయిన్స్‌కు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకేసారి ప్రిపేర్ కావడం వల్ల అభ్యర్థులకు అనేక లాభాలుంటాయన్నారు. మనం లక్ష్యసాధన కోసం చిత్తశుద్ధి, క్రమశిక్షణతో ప్రయత్నిస్తే ఆలస్యమైనా దాని ఫలితం తప్పకుండా వచ్చి తీరుతుందన్నారు. ఏకం ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి సతీష్ కుమార్ మాట్లాడుతూ తమ అకాడమీ బ్రాంచ్‌లు ఢిల్లీ, హైదరాబాద్‌లో ఉన్నాయని వివరించారు. హైదరాబాద్‌లో ఏకం ఐఏఎస్ అకాడమీ స్థాపించి మూడేళ్లు పూర్తయిందని చెప్పారు. ఏకం అంటే సబ్జెక్టుతో పాటు ఏకమై జర్నీలో మమేకం కావడమే తమ లక్ష్యమని అన్నారు. తాను సదరన్ రైల్వేలో విధులు నిర్వహిస్తూనే ఈ అకాడమీ కోసం పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అకాడమీలో చేయడం ద్వారా అభ్యర్థులు తమ కలలను నిజం చేసుకోవచ్చునని తెలిపారు.

బొల్లినేనిలో నూతన కోర్సులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి అనుబంధ బొల్లినేని మెడిస్కిల్స్ నందు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పదోతరగతి అర్హతతో మూడు నెలలు కోర్సులో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆదిత్యుని సన్నిధిలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్



ఆదిత్యుని జ్ఞాపికను ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్‌కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర రెవెన్యూ ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈయనకు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను శంకరశర్మ ఆయనకు వివరించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి, తీర్థ ప్రసాదాలను అందించారు. తర్వాత ఆదిత్యుని జ్ఞాపికను జాయింట్ కలెక్టర్ నవీన్ సాయిప్రసాద్‌కు అందజేశారు. వీరి వెంట ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ రాణి, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీసీ సంఘ నేతలు



కలెక్టర్‌తో బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను జిల్లా బీసీ సంఘ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీసీ సంఘం ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పైడి చంద్రరావు, తోణంగి వెంకన్న యాదవ్, రత్నాల మురళి కృష్ణ, మైలపల్లి నరసింహమూర్తి, వైశ్యరాజు శ్రీనివాసరాజు, ఇప్పిలి మధుసూదనరావు, పాపారావు, దండుగుల పార్థసారథి, పంద్రంకి రమేష్ తదితరులు ఉన్నారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి



మృతి చెందిన పోతయ్య (ఫైల్)

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య(67) వేటకు వెళ్లి పడవ బోల్తా పడడంతో మృతి చెందారు. గ్రామస్తులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొవ్వాడ గ్రామానికి చెందిన పోతయ్య, అతని కుమారుడు రాముడు, మరో వ్యక్తి సీతయ్య శనివారం తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో సముద్రంలోకి వెళ్లారు. అలల ఆటుపోట్లకు పడవ బోల్తా పడడంతో పోతయ్య మృతి చెందారు. మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. తర్వాత గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. పోతయ్యకు భార్య సీతమ్మ, పెళ్లయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలముకున్నాయి. జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కాశీబుగ్గ ఎల్‌సీ గేటును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న కాశీబుగ్గ ఎల్‌సీ గేట్‌ను ఆర్టీసీ బస్సు శనివారం ఢీ కొట్టింది. రైలు వస్తుందని గేటు వేస్తుండగా.. శ్రీకాకుళం నుంచి పలాస వస్తున్న శ్రీకాకుళం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు వేగంగా దూసుకువచ్చింది. బస్సు ముందుభాగం ప్రవేశించినప్పటికీ గేటుకు బస్సు లగేజి స్టాండ్ తగలడంతో రైల్వే గేటు రెండు ముక్కలైంది. దీంతో పలాస రైల్వేస్టేషన్‌కు అనుసంధానమైన రైల్వే సిగ్నల్ వ్యవస్థ దెబ్బతింది. రైలు వస్తున్న సిగ్నల్ రావడంతో గందరగోళం చోటు చేసుకుంది. వెంటనే రైల్వే సిబ్బంది స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించారు.

ఖతార్‌లో వలస కూలీ మృతి



బుడ్డెపు గున్నయ్య

కంచిలి: మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురం గ్రామానికి చెందిన బుడ్డెపు గున్నయ్య(53) ఖతార్‌లో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన ఇటీవల దసరాకు ఇంటికి వచ్చి ఖతార్ వెళ్లారు. అక్కడి కన్‌స్ట్రక్షన్ కంపెనీలో రిగ్గర్‌గా పనిచేస్తుండేవారు. పని చేస్తున్న ప్రదేశంలో గుండె నొప్పి రావడంతో స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య కిరామణి, ముగ్గురు కుమార్తెలు ధనలక్ష్మీ, గీతాంజలి, నీలవేణి ఉన్నారు. ఇంతవరకు పిల్లలకు వివాహాలు కాలేదు. మార్చి నెలలో రెండో కుమార్తె గీతాంజలి వివాహం జరగనుంది. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రెండు రోజుల్లో గున్నయ్య మృతదేహం స్వగ్రామానికి చేరుతుందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలి వద్ద తీవ్రగాయాలతో బాధితులు

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారి కోసంగిపురం కూడలి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో మందస మండలం కొండలోగాం గ్రామానికి చెందిన సవర దివాకర్, సవర వెన్నెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అదే రూట్‌లో ప్రయాణిస్తున్న సోంపేట జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం గ్రామ సర్పంచ్ తడక జోగారావు సంఘటనా స్థలానికి చేరుకుని సపర్యలు చేశారు. 108కు ఫోన్ చేసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.





శంకరరావుకు పరామర్శ

వైఎస్సార్ సీపీ నాయకుడు జరుగుళ్ల శంకరరావును శనివారం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. శంకరరావుపై దాడి జరగడం దురదృష్టకరమని వారు అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ